క్లుప్తంగా

స్పీకర్‌పై చర్యలకు డిమాండు

యానాం: పుదుచ్చేరి అసెంబ్లీ స్పీకర్ ఆర్ సెల్వంపై అవిశ్వాసం పెట్టాలంటూ ఎన్డీయే కూటమి ప్రభుత్వానికి మద్దతిస్తున్న మరో ఎమ్మెల్యే అంగలన్ శనివారం అసెంబ్లీ కార్యదర్శి దయాలన్‌కు వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే ఇండిపెండెంట్ ఎమ్మెల్యే నెహ్రూ సైతం స్పీకర్‌పై అవిశ్వాసానికి నోటీసు ఇచ్చిన సంగతి తెలిసిందే. సెల్వం రాజ్యాంగ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడతున్నారని ఆయనను తొలగించాలని డిమాండ్ చేశారు

జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక



జాహ్నవి లావణ్యను అభినందిస్తున్న హెచ్‌ఎం రాజేశ్వరి, పీడీ నీలిమ

తాళ్లరేవు: ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలలో చొల్లంగి ఉన్నత పాఠశాల విద్యార్థిని హెచ్.జాహ్నవి లావణ్య ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ హెచ్‌ఎం రాజేశ్వరి శనివారం తెలిపారు. ఈ నెల 14 నుంచి 16 వరకు పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-19 రాష్ట్రస్థాయి బేస్‌బాల్ క్రీడా పోటీలలో తమ స్కూల్ నుంచి పి.పుష్పలత, ఆర్.వీరశ్రావణి, హెచ్.జాహ్నవి లావణ్యలు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించారన్నారు. వారిలో జాహ్నవి లావణ్య ప్రతిభ కనబరచి జాతీయ జట్టుకు ఎంపికై ందన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రతిభ కనబరచిన విద్యార్థినితో పాటు తర్ఫీదునిచ్చిన స్కూల్ పీడీ నీలిమను అభినందించారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు




పాలగుమ్మి రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ కిషోర్‌బాబు

అమలాపురం రూరల్: భూ సంబంధిత సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం గ్రామస్థాయిలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని తహసీల్దార్ కిషోర్‌బాబు తెలిపారు. మండలంలోని పాలగుమ్మి సచివాలయం వద్ద శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్‌కు పలువురు భూ సమస్యలపై ఫిర్యాదు చేశారు. ప్రజల నుంచి తహసీల్దార్ అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుడుపూడి రామలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ అశోక్ కుమార్, ఉప సర్పంచ్ వసంత్‌కుమార్, రెవెన్యూ ఉద్యోగులు, సర్వేయర్లు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి

ముమ్మిడివరం: భూ సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న గ్రామ రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ యంవీ సుబ్బలక్ష్మి సూచించారు.మండలంలో అనాతవరంలో సర్పంచ్ మిమ్మిర్తి చిరంజీవి అధ్యక్షతన జరిగిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. భూ యజమానుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మ్యూటేషన్, భూసర్వేకి సంబంధించి 41 దరఖాస్తులు స్వీకరించారు. ఉప సర్పంచ్ పేరిచర్ల సురేశ్‌రాజు, శీలం వెంకటేశ్వరరావు, కురసాల శివ, దంగేటి పండు, పెయ్యల పరశురాముడు, వాసంశెట్టి పట్టాభిరామయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 106 మంది విద్యార్థుల ఎంపిక



జాబ్ మేళా నిర్వహిస్తున్న వివిధ కంపెనీల ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ప్రాంగణంలో పలు ప్రముఖ కంపెనీలు గత రెండు రోజులుగా నిర్వహించిన మినీ జాబ్ మేళాలో కళాశాలకు చెందిన 106 మంది విద్యార్థులు ఉద్యోగాలను కై వసం చేసుకున్నారని ఆ కళాశాల కరస్పాండెంట్ కేవీఆర్ఎన్ నరసింహారావు తెలిపారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ కె.మనోహర్, ఏవో కరాటం ప్రవీణ్ తదితరులు అభినందించారు. టెక్ మహీంద్ర, హెచ్‌డీఎఫ్‌సీ,అపోలో ఫార్మసీ, జెన్కో, టీసీఎస్ తదితర కంపెనీలు ఈ జాబ్ మేళా నిర్వహించాయి.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

అమలాపురం రూరల్: అమలాపురం జనకల్యాణ్ కార్యాలయంలో రెడీమ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాస్టర్ విజయబాబు అధ్యక్షతన వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన అంతర్జాతీయ సువార్తకులు బ్రదర్ ఏడ్వర్డ్ విలియమ్స్ మాట్లాడుతూ మానవాళిని రక్షించటానికి యేసుక్రీస్తు లోక రక్షకుడిగా ఈ భూమి మీదకు వచ్చాడన్నారు. ఏరియా హాస్పిటల్ డీఎస్ ఆర్‌సీ కౌన్సిలర్ కవిత, మెండి కమల, కమ్యూనిటీ లీడర్స్ సతీష్ భావన, నక్షిబాబు, కడలి సత్యనారాయణ, కమ్యూనిటీ సభ్యులు రమణి తదితరులు పాల్గొన్నారు.

జననేత జన్మదినం.. పేదలకు పర్వదినం

- ఘనంగా మాజీ సీఎం వైఎస్ జగన్ పుట్టిన రోజు వేడుకలు
- అంబరాన్ని తాకిన సంబరాలు
- పలుచోట్ల రక్తదానం, దుస్తుల వితరణ
- ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు, పాలు పంపిణీ
- వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో జోష్



అమలాపురంలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, వైఎస్సార్ సీపీ నాయకులు



ముమ్మిడివరంలోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పొన్నాడ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకొంటున్న పార్టీ శ్రేణులు

అమలాపురం టౌన్: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ ముద్ర ప్రతి ఇంటా ఎప్పటికీ పదిలంగా ఉంటుందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పినిపే విశ్వరూప్ అన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా అమలాపురం హైస్కూలు సెంటరులో నియోజకవర్గ పార్టీ శ్రేణుల సమక్షంలో శనివారం ఉదయం కేక్ కట్ చేశారు. మాజీ మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్‌తో కలిసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత హైస్కూలు సెంటరులో ఉన్న మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి విశ్వరూప్ తదితరులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అదే విగ్రహం వద్ద జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన కేక్‌ను మాజీ మంత్రి, ఎమ్మెల్సీలు కట్ చేశారు. అక్కడే పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఎమ్మెల్సీలు సూర్యనారాయణరావు, ఇజ్రాయిల్‌లు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాల పేరుతో బూటకపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని గాలికి వదిలేశారని విమర్శించారు. కూటమి పార్టీకి ఓటు వేసి తప్పు చేశామనే భావన నేడు ప్రజల్లో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డే సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని మళ్లీ జగనన్న పాలన రావడం ఖాయమని అన్నారు.. అనంతరం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో జిల్లా పార్టీ ఐటీ విభాగం ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పార్టీ యువకుల రక్తదాన శిబిరాన్ని మాజీ మంత్రి విశ్వరూప్ ప్రారంభించారు. పార్టీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు తోరం గౌతమ్ రాజా ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో దాదాపు 40 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైస్ చైర్మన్లు తిక్కిరెడ్డి వెంకటేష్, రుద్రరాజు నానిరాజు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, అమలాపురం జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామగోపాల్, అల్లవరం ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, అమలాపురం రూరల్, అల్లవరం మండలాల పార్టీ అధ్యక్షులు బొంతు గోవిందశెట్టి, కొనుకు బాపూజీ, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, సెంట్రల్ డెల్టా బోర్డు మాజీ చైర్మన్ కుడుపూడి బాబు, పార్టీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖాదర్, పార్టీ చేనేత విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కామిశెట్టి శ్రీనివాసరావు, పార్టీ అనుబంధ కమిటీల నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

స్థానిక హరి మనో వికాస కేంద్రంలోని దివ్యాంగుల సమక్షంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు శనివారం జరిగాయి. ఇళ్ల కిషోర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దివ్యాంగుల ఆధ్వర్యంలో జగన్ పుట్టిన రోజు కేక్ కట్ చేశారు. జగన్‌మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిల్లెళ్ల రమేష్ ఆధ్వర్యంలో స్థానిక బుద్దాల నాగరత్నం మెమోరియల్ వలంటరీ బ్లడ్ బ్యాంక్‌లో శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో పార్టీకి చెందిన 52 మంది యువకులు శనివారం రక్తమిచ్చారు. ఈ రక్త దాన శిబిరాన్ని మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పినిపే విశ్వరూప్ ప్రారంభించారు. జగన్‌మోహన్ రెడ్డిపై ఉన్న అభిమానంతో పార్టీ యువకులు ఇలా రక్తదానం చేయడం అభినందనీయమని విశ్వరూప్ అన్నారు. ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసిన విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్, జిల్లా అధ్యక్షుడు శిరీష్‌లను విశ్వరూప్ అభినందించారు.

ఐ.పోలవరం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఐ.పోలవరం మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. శనివారం కేశనకుర్రుపాలెం మండల పార్టీ కార్యాలయం వద్ద మండల పార్టీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు అధ్యక్షతన నిర్వహించిన జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలకు మండలంలోని 14 గ్రామ పంచాయతీల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యారు. మండల పార్టీ కన్వీనర్ పిన్నంరాజు శ్రీనివాసరాజు మాట్లాడారు. అనంతరం భారీ కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. టి.కొత్తపల్లి, జి.మూలపొంలో పార్టీ నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున జగనన్న పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు.

ముమ్మిడివరం: రాష్ట్రంలో సంక్షేమ రాజ్యాన్ని అందించిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలు జన్మదిన వేడుకల్లో పాల్గొని జననేతకు జేజేలు పలికారు. పార్టీ కార్యాలయంలో పార్టీనేతలు, కార్యకర్తలు అభిమానుల సమక్షంలో మాజీ ఎమ్మెల్యే పొన్నాడ కేక్ కట్ చేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: మాజీ ముఖ్యమంత్రి జగన్ పుట్టినరోజు వేడుకలను శనివారం తాళ్లరేవు మండలంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక చెరువుగట్టు సెంటర్‌లోని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్ అధ్యక్షతన జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి సామ్యూల్ సాగర్, పార్టీ మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు దడాల జగదీశ్వరరావు, పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు మట్టపర్తి లోవరాజు తదితరులు సీఎం జగన్ బర్త్‌డే కేకును కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాలను నెరవేర్చే విధంగా జగన్ పాలన చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసగిస్తుందని ఆరోపించారు. జగనన్న ఉంటే క్యాలెండర్ ప్రకారం సంక్షేమ పథకాలను అందించేవారని ప్రజలు గుర్తించినట్లు తెలిపారు. పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో సుమారు 100 మందికి చీరలు పంపిణీ చేశారు. సామాజిక ఆస్పత్రిలో పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. సీతారామపురంలోని రిలయన్స్ దివ్యాంగుల పాఠశాలలో దివ్యాంగులకు భోజనాలు ఏర్పాటు చేశారు. కోరంగిలోని దుర్గామల్లేశ్వర వృద్ధుల అనాథ బాలల ఆశ్రమంలో రూ.10 వేలు విలువ చేసే కిరాణా సరకులు అందజేశారు.

ఉప్పలగుప్తం: జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను పార్టీ శ్రేణులు ఆయా గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బద్రి బాబ్జి ఆధ్వర్యంలో మండలంలోని గొల్లవిల్లి భీమేశ్వర ఆడిటోరియంలో శనివారం జగన్ పుట్టినరోజు వేడుకలను కార్యకర్తలు, పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కోసి, మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు, పార్టీ నాయకుడు కుంచే రమణారావు, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి చిక్కం బాలయ్య, మండల ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజు, సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, ఎంపీటీసీల సమాఖ్య మండల అధ్యక్షుడు పెట్టా అప్పారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మకాయల హనుమంతు శ్రీనివాసరావు, ఎస్సీ సెల్, బీసీ సెల్ అధ్యక్షులు పోతుమూడి కొండబాబు, యనమదల పల్లంరాజు, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ చీకట్ల కిషోర్, మర్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ చప్పిడి దుర్గారావు, సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. అల్లవరం హైస్కూల్ సెంటర్లో జరిగిన వేడుకలకు ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన కేక్ కట్ చేశారు. జననేతకి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ ఆర్థిక సహాయంతో అల్లవరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. గోడిలోని తన నివాసంలో వృద్ధులు, వితంతువులకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డీ గంగ, యల్లమిల్లి బోసు, సర్పంచ్ సాధనాల వెంకటరావు, సాలె శ్రీనివాసరావు, ఎంపీటీసీలు పులుసు గంటి రాజేశ్వరి, పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, మాకే కృష్ణమూర్తి, పార్టీ నాయకులు వాసంశెట్టి నరసింహారావు, తిక్క ప్రసాద్, రేవు శ్రీనివాసరావు, దొమ్మేటి వెంకటేశ్వరరావు, పల్లి జేమ్స్, రేవు సుందరరావు పాల్గొన్నారు. కొమరగిరిపట్నం బ్యాంక్ వద్ద వైఎస్ జగన్ పుట్టినరోజు వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమం లో సర్పంచ్ రాకపు విజయలక్ష్మి, నామన సిద్ధాంతి, కడలి లక్ష్మణరావు, శేఖర్, బొంతు సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఎన్.కొత్తపల్లిలో జరిగిన వేడుకల్లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు నాగేశ్వరరావు, లంకె సూరిబాబులు పాల్గొన్నారు.

కాట్రేనికోన: మండలంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను నాయకులు, కార్యకర్తలు పండుగలా జరుపుకున్నారు. మండల పరిధిలోగల గ్రామాలలో జగనన్న జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పల్లంకుర్రు, కాట్రేనికోన, కందికుప్ప సర్పంచులు నాతి అలివేణి, గంటి వెంకట సుధాకర్, చల్లగల వెంకట లక్ష్మిల అధ్యక్షతన జరిగిన వేడుకలలో జన్మదిన కేక్‌ను కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. కాట్రేనికోనలో మండల పార్టీ కన్వీనర్ నల్లా నరసింహమూర్తి, నడింపల్లి సూరిబాబు, పాలెపు ధర్మారావులతో పాటు నాయకులు కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.



కాట్రేనికోనలో వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు జరుపుకొంటున్న నాయకులు



ఐ.పోలవరం మండలం కేశనకుర్రుపాలెం పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



తాళ్లరేవులో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి శామ్యూల్ సాగర్ తదితరులు



ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లిలో కేక్ కట్ చేస్తున్న పార్టీ నాయకులు



అల్లవరంలో మండల పార్టీ అధ్యక్షుడు బాపూజీకి కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

కాలుష్య నియంత్రణ చర్యలు తప్పనిసరి

జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్



ఓఎన్జీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: చమురు, సహజ వాయువుల సంస్థలు చమురు నిక్షేపాలను అన్వేషిస్తున్న ప్రాంతాలలో ప్రజా శ్రేయస్సు దృష్ట్యా పర్యావరణ, కాలుష్య నియంత్రణా చర్యలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ పేర్కొన్నారు. శనివారం కలెక్టర్ రాజమహేంద్రవరంలోని ఓఎన్జీసీ కార్యాలయాన్ని (అసెట్) మొదటిసారి సందర్శించారు. ఓఎన్జీసీ సీనియర్ అధికారులతో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. తొలుత ఓఎన్జీసీ కార్యకలాపాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వీక్షించి అవగాహన పొందారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా అసెట్ మేనేజర్ శాంతాను దాస్ చమురు – గ్యాస్ ఉత్పత్తి యొక్క ప్రస్తుత స్థితి, కేజీ– పీజీ బేసిన్‌లో ఓఎన్జీసీ విస్తరణ ప్రణాళికలను విశదీకరించారు. జిల్లా పరిపాలన యంత్రాంగం నుంచి అవసరమైన మద్దతు ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి అర్ధ భాగంలో ఓఎన్జీసీ నష్టాలను చవి చూసిందని ఓఎన్జీసీ సామర్థ్యాన్ని పెంపొం దించడానికి సహకరించాలని జిల్లా కలెక్టర్‌ను సంస్థ అధికారులు కోరారు.

డీఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఐజీ



అమలాపురం డీఎస్పీ కార్యాలయంలో ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ కృష్ణారావు తదితరులు

అమలాపురం టౌన్: అమలాపురం డీఎస్పీ కార్యాలయాన్ని ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ శనివారం సాయంత్రం తనిఖీ చేశారు. తొలుత ఐజీ పి.గన్నవరం పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం అమలాపురం డీఎస్పీ కార్యాలయానికి వచ్చి క్రైమ్ రికార్డులను తనిఖీ చేశారు. దాదాపు రెండు గంటల పాటు జరిగిన ఈ తనిఖీల్లో ఐజీ అశోక్ కుమార్ పోలీస్ సబ్ డివిజన్‌లోని క్రైమ్ రికార్డులతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పురోగతిపై ఆరా తీశారు. తొలుత డీఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో జిల్లా ఆర్మ్‌డ్ దళం చే గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఆయనతో పాటు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు తనిఖీల్లో ఉన్నారు. అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు, అమలాపురం రూరల్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ముమ్మిడివరం సీఐ మోహన్‌కుమార్, స్పెషల్ బ్రాంచి సీఐ బి.రాజశేఖర్‌తో పాటు అమలాపురం పోలీస్ సబ్ డివిజన్‌లోని ఎస్సైలు పాల్గొన్నారు.

గోదావరి మధ్య డెల్టా ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు ఏకగ్రీవం



నూతనంగా ఎన్నికైన ప్రాజెక్టు కమిటీ

అమలాపురం రూరల్: గోదావరి మధ్య డెల్టా నీటి వినియోగదారుల సంఘాలకు సంబంధించి ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు కలెక్టరేట్‌లో శనివారం ఏకగ్రీవంగా జరిగాయి. ప్రాజెక్టు కమిటీ అధ్యక్షుడుగా రాజోలుకు చెందిన గుబ్బల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా కొత్తపేటకు చెందిన కరుటూరు నరసింహారావులతో పాటు కమిటీ సభ్యులు ఎన్నికైనట్లు జలవనరుల శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ బీ. శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ఈ నెల 14వ తేదీన కోనసీమ జిల్లాలో గోదావరి తూర్పు, మధ్య డెల్టాలోని 83 సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు నిర్వహించినట్లు చెప్పారు. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ సాగునీటి వనరులు నిర్వహణ స్థానిక సంఘాలే చేపట్టాలని, గత కొంత కాలంగా పూడికతీత పనులు, మరమ్మతులు, కాలువ గట్ల బలోపేతం వంటి వాటిపై క్షేత్రస్థాయిలో ముఖ్యమైన పనులు నిలిచిపోయా యన్నారు. సాగునీటి సంఘాలు నీటి వనరుల నిర్వహణకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాట్లాడుతూ కోనసీమ జిల్లాలో రాజోలు చిట్టచివరి డెల్టా ప్రాంతమని ఖరీఫ్ సీజన్లో చిట్టచివరి వరకు సాగు నీరు సకాలంలో అందక సాగు ఆలస్యం అవుతోందన్నారు. మాజీ శాసన మండలి ఉపాధ్యక్షుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, అమలాపురం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, ప్రజా ప్రతినిధులు నూతనంగా ఎన్నికై న సభ్యులను అభినందించారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై దళిత సంఘాల నిరసన



బుద్ధాపార్క్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న యానాం దళిత సంఘాలు



అమలాపురంలో నిరసన తెలుపుతున్న దళిత ప్రజా సంఘాలు, ఆటో యూనియన్ నాయకులు

యానాం: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా యానాం నియోజకవర్గ ఎస్సీ సంక్షేమ సంఘాలు, దళిత పెద్దలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో శనివారం భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లో అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్షీరాభిషేకాన్ని నిర్వహించారు. అనంతరం అక్కడ నుంచి ర్యాలీగా బయలుదేరి అంబేడ్కర్ చిత్రాలు చేబూని అమిత్‌షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం బుద్ధాపార్క్ వద్ద సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు నక్కా వాసుదేవరావు, దుప్పి బాలరాజు, గుర్రపు ప్రహ్లాదుడు, కోరుకొండ రాజేంద్రప్రసాద్, మెల్లం శ్రీనివాస్, నవరం పుత్రయ్య, పువ్వల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా రాజీనామాకు డిమాండు

అమలాపురం టౌన్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా తక్షణమే రాజీనామా చేయాలని పలు దళిత ప్రజా సంఘాలు, ఆటో యూనియన్ కార్మికులు డిమాండ్ చేశారు. అమలాపురంలోని ఎర్ర వంతెన వద్ద ది కోనసీమ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన నిరసన కార్యక్రమంలో అమిత్ షా డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు మాట్లాడుతూ అణగారిన వర్గాలు, దళితులను కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అణిచి వేసేందుకు పన్నుతున్న కుట్రలో భాగమే ఇప్పుడు అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడమని గుర్తు చేశారు. అమిత్‌షా క్షమాపణ చెప్పాలని, ఆయనను కేంద్ర మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో దళిత ప్రజా సంఘాల నాయకులు గెద్దాడ బుద్ధరాజు, మెండి డేవిడ్‌తో పాటు ఆటో కార్మికులు పాల్గొన్నారు.

గణితశాస్త్రంతో జ్ఞాపకశక్తి వృద్ధి

అమలాపురం టౌన్: విద్యార్థుల్లో జ్ఞాపక శక్తి, మేధో సామర్థ్యాలను పెంచేందుకు గణితశాస్త్రం ఓ అద్భుత సాధనంగా ఉపయోగపడుతుందని కోనసీమ సైన్స్ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సీవీ సర్వేశ్వరశర్మ అన్నారు. జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా స్థానిక వెంకటేశ్వరా కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్‌లో శనివారం జరిగిన కోనసీమ సైన్స్ పరిషత్ మహాసభలో ఆయన మాట్లాడారు. ఆర్థిక నిర్వహణలో గణితం మూలాధారమై పనిచేస్తుందన్నారు. గణితాన్ని చాలా మంది ప్రపంచ భాషగా అభివర్ణిస్తారని గుర్తు చేశారు. మహాసభకు అధ్యక్షత వహించిన కాలేజీ ప్రిన్సిపాల్ కెఎస్‌వీఎస్ మనోహర్ మాట్లాడుతూ గణిత ప్రావీణ్యం అనేక కొత్త ఉద్యోగావకాశాలకు తలుపు తెరుస్తుందన్నారు. మహాసభలో కాలేజీ ఏవో కరాటం ప్రవీణ్, అధ్యాపకులు ఈతకోట శ్రీలక్ష్మి, యాళంగి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కాలేజీ తరుపున డాక్టర్ సర్వేశ్వరశర్మను కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కేవీఆర్ఎన్ నరసింహారావు తదితరులు సత్కరించారు.

కాట్రేనికోన: చెయ్యేరు శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలో భారతీయ గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం శ్రీనివాస్ కుమార్ అధ్యక్షతన వేడుకలు నిర్వహించారు. శ్రీనివాస అటానమస్ ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ గణిత శాస్త్ర దినోత్సవ వేడుకలను ప్రిన్సిపాల్ డా.ఎం శ్రీనివాస కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డీవీఎస్ఎన్ వర్మ, పాలక వర్గసభ్యులు సందీప్, రమేష్ రాజు, కళాశాల విద్యాశాఖాధికారి డా.ఎస్ జయలక్ష్మి, గణిత శాస్త్ర అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

వచ్చే నెల 18 నుంచి ఏఐవైఎఫ్ జిల్లా మహాసభలు

అమలాపురం టౌన్: అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా మహాసభలు జనవరి 18,19 తేదీల్లో అమలాపురంలో నిర్వహించాలని ఆ సంస్థ జిల్లా కమిటీ సమావేశం నిర్ణయించింది. స్థానిక కురసాల వారి వీధిలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏఐవైఎఫ్ జిల్లా కో కన్వీనర్ ఉగ్గిరాల సురేష్ అధ్యక్షతన శనివారం జరిగిన జిల్లా సమావేశం మహా సభల నిర్వహణపై చర్చించింది. సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ బాలకృష్ణ సమావేశానికి అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. జనవరి పదో తేదీ లోపు జిల్లాలోని నియోజకవర్గాల కమిటీలు ఏర్పాటు చేసుకుని జిల్లా మహా సభలకు ప్రతినిధులను ఎంపిక చేయాలని వారు తెలిపారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర మహా సభలు 2025 ఫిబ్రవరి 6,7,8,9 తేదీల్లో నిర్వహిస్తున్న దృష్ట్యా జిల్లా నుంచి అధిక సంఖ్యలో తరలి వెళ్లే అంశం పై సమావేశం చర్చించింది.

కర్మేంద్రియాల నియంత్రణ ధ్యానంతోనే సాధ్యం

డీఈవో షేక్ సలీమ్ బాషా

అమలాపురం టౌన్: కర్మేంద్రియాలను నియంత్రించేందుకు, మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు ఏకైక సాధనం ధ్యానమని డీఈవో షేక్ సలీమ్ బాషా అన్నారు. ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయం అమలాపురం శాఖ ఓ శాంతి కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక ప్రధాన భవనంలో ధ్యాన తరగతులను డీఈవో బాషా జ్యోతి ప్రజ్వలన చేసి శనివారం ప్రారంభించారు. ఓశాంతి కేంద్రం ఇన్‌చార్జి బ్రహ్మకుమారి శ్రీదేవి ఆధ్వర్యంలో జరిగిన ఈ ధ్యాన తరగతుల్లో 'ధ్యాన మార్గం ముఖ్య సాధనం' అనే అంశంపై ఆమె ఉపన్యసించారు. మరో ముఖ్య అతిథిగా విచ్చేసిన అమలాపురం మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు ధ్యానం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి మాట్లాడారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్‌లు మాట్లాడారు. మెడిటేషన్ ట్రైనర్, బ్రహ్మకుమారి స్వరూప ×ధ్యానంపై ధ్యాస॰ అనే అంశంపై ఉపన్యసించారు. అమలాపురం ఓంశాంతి కేంద్రంలో తొలిసారిగా ధ్యాన దినోత్సవాన్ని నిర్వహించి అనేక మంది విద్యావంతులు, మేధావులు ధ్యాన శిక్షణలో పాల్గొనడం శుభ పరిణామమని కేంద్రం ఇన్‌చార్జి బీకే శ్రీదేవి తెలిపారు.



అమలాపురంలో జ్యోతి ప్రజ్వలన చేసి ధ్యాన తరగతులను ప్రారంభిస్తున్న డీఈవో బాషా, మున్సిపల్ కమిషనర్ రాజు, బ్రహ్మకుమారీలు